కథా నిలయం
1278
శ్రీకాకుళం

# తమ్ముడు

ఉదయం పదిగంటలు కావస్తోంది.

అతడినే చూస్తున్నాను. అరగంట నించీ అతను అక్కడే నిలబడి వున్నాడు. అతని దగ్గర ఇంకా చాలామంది నిల్చుని అసహనంగా అటూఇటూ దిక్కులు చూస్తున్నారు.

అతను చాలా డాబుగా వున్నాడు. ఖరీదైన వాచీ వుంది. క్రాపును పైకి దువ్వుకున్నాడు. కళ్ళకు నల్లని అద్దాలు పెట్టుకున్నాడు. ఎడమచేతి మధ్యవేలికి ఎరుపురాయి వుంగరం కూడా వుంది. ఎండ దానిమీద పడుతున్నప్పుడు తళుక్కున మెరుస్తోంది.

సాధారణంగా నా ఎన్నికలో పొరపాటు వుండదు. అతను తప్పకుండా డబ్బున్న వాడే ఐ వుంటాడు. అతని దగ్గర పర్సు- ఆ పర్సులో కనీసం వందరూపాయిలు వుండే వుంటాయి.

నా అంచనా తప్పు అయ్యే అవకాశం లేదు.

ఇది నా నమ్మకం-

కాదు-

నా వృత్తి నేర్పిన అనుభవం....

ఇంతకీ నా వృత్తి -.... జేబు దొంగతనం- ఇదే....

అతను విసుగ్గా ఓసారి వాచీకేసి చూసుకున్నాడు- తలెత్తి బస్సు వచ్చే దిక్కుగా చూశాడు. తర్వాత చిన్నగా అక్కడి నుంచి కూల్ డ్రింక్స్ షాపువైపు నడిచాడు.

అతడిని అనుసరించాను.

షాపుదగ్గర ఆగాడతను.

కొంచెం దూరంలో ఆగిపోయాను.

ఓ డ్రింక్ తాగి డబ్బులివ్వటానికి పర్సు తీశాడు జేబులోనించి- అందులోనించి డబ్బు తీస్తున్నప్పుడు చూశాను. అందులో కనీసం పది రూపాయల కాగితాలు ఓ ఇరవై వుండే వుంటాయి.

నా సంతోషానికి అంతులేదు.

ఆ పర్సును కొట్టెయ్య గలిగితే రెండురోజుల వరకు హాయిగా గడిపెయ్యవచ్చు.

ఇంతకీ నా అదృష్టం ఎలా వున్నదో ఈరోజు. ప్రతి రోజూ అదృష్టం గురించి ఆలోచించడం నాకో అలవాటయి పోయింది. ఎందు కంటే నేను చిన్నతనం నించే చాలా దురదృష్టవంతుడిని- అందుకే నాకెవరూ మిగల్లేదు. ఒంటరి వాడిగా నేను మిగిలిపోయాను.


కూల్‌డ్రింక్ తాగిన తర్వాత అతను సిగరెట్టు ముట్టించాడు. విలాసంగా పొగ పీలుస్తూ అక్కడినించి కదిలాడు. అతనికి తెలియ కుండానే అతడిని అనుసరించాను.

బస్టాపు దగ్గిర ఇప్పుడు జనం మరీ ఎక్కువగా పెరిగిపోయారు. తొమ్మిది గంటలకు రావలసిన బస్సు ఇంతవరకూ రాలేదు.

బస్సులు ఆలస్యంగా రావటం, రద్దీ పెరగటం నాలాంటి చేతి పనివాళ్ళకు బాగా ఉపయోగంగా, లాభదాయకంగా వుంటుంది. అందుకే నేనెప్పుడూ బస్సులు ఆలస్యంగా రావాలనే కోరుకుంటాను.

సిగరెట్టును దూరంగా విసిరాడు.

ఒకసారి కళ్ళజోడుతీసి కర్చీఫ్‌తో తుడుచుకుని మళ్ళీ తగిలించు కున్నాడు.



ఉన్నట్టుండి చప్పుడు చేసుకుంటూ బస్సువచ్చి అక్కడఆగింది.. ఒక్కసారిగా జనం దానిమీదకు విరుచుకు పడ్డారు.

ఉలిక్కిపడి ముందుకు దూకాడు ఆ దాబుగా వున్నతను. అతడి వెనుకే నేనూ- ఒకర్నొకరు తోసుకుంటున్నారు. ఎవరో ఒకాయన సూట్ కేసు అడ్డంగా పెట్టాడు. అంతా అయన్ను తిడుతున్నారు.

ఎవరికీ జేబుల గురించి, పర్సుల గురించీ, జేబుదొంగలగురించీ, దొంగతనం గురించీ ఆలోచనే లేదు. అలాంటి సమయంలో ఓ ప్రయాణికుడిగా వాళ్ళలో ప్రవేశించి- నేను అనుకున్న కార్యాన్ని సాధించి వాళ్ళనించి తప్పుకుని దూరంగా వచ్చేశాను.

వాళ్ళింకా నెట్టుకుంటూనే వున్నారు.

క్షణం కూడా ఆలస్యం చెయ్యలేదు నేను-

బయటకు వచ్చి రిక్షాలో ఎక్కాను. ఆవూళ్ళో వున్న ఓ ముఖ్యమైన సెంటర్‌కు బయలుదేరాను. ఇప్పుడు నా జేబులో ఆ పర్సువుంది. అందులో ఇరవైకి పైగా పది రూపాయల నోట్లు వున్నాయి. ఎన్ని వున్నాయో లెక్కించాలని అనిపించింది. ఐనా బయటకు తియ్యలేదు. ఇప్పుడు కాదు తర్వాత ఆపని చెయ్యాలి.

ఇప్పుడు నేను కూడా కూల్‌డ్రింక్ తాగొచ్చు. ఎన్ని సిగరెట్లయినా కాల్చెయ్యవచ్చు. రెండురోజులు ఈవృత్తికి సెలవు పెట్టవచ్చు-

రిక్షా ఆగింది- రెండు రూపాయలిచ్చాను. రిక్షావాడు చిల్లర ఇవ్వబోయాడు. కానీ నేను తీసుకోలేదు.

ఖరీదైన హోటల్లోకి వెళ్ళాను.

రెండు రకాల టిఫెన్లకు ఆర్డరిచ్చి కుర్చీలో వెనక్కు వాలాను. నా ఆలోచన్లు ఎక్కడో వున్నాయి.

ఈరోజు నా అదృష్టం బాగానే వుంది. ఎందుకంటే ఇన్నేళ్ళుగా జేబు దొంగతనాలు చేస్తున్నా ఒక్కసారి కూడా పట్టుపడలేదు. పోలీసు రికార్డులలోకి ఎక్కలేదు. ఇందుక్కారణం నేను ఒకే ప్రదేశంలో లేక ఒకే ఊళ్ళో స్థిరంగా వుండకపోవటమే-

టిఫిన్ తిన్నతరువాత రెండు కూల్‌డ్రింక్స్ తాగాను.

బాగుంది.

ఒక్కసారి అటూఇటూచూసి పర్సు బయటకు తీశాను. తెరిచాను. పదిరూపాయల నోట్లను లెక్కించాను.

ఇరవై రెండు వున్నాయి.

ఇంకొంచెం చిల్లర వుంది.

మరో అరలో ఏదో వుంది. వేళ్ళు పోనిచ్చి దాన్ని బయటకు లాగాను. అది ఒక ఫోటో-

దాన్ని చూడటంతోనే నా గుండె ఆగిపోయినట్లు అనిపించింది. సంతోషం కలిగింది. వెంటనే దుఃఖం కూడా కలిగింది.

అది నా చిన్నతనంలో ఫోటో- ఆఫోటోలో నా ప్రక్కనే నా తమ్ముడు కూడా వున్నాడు.

నేను ఇంతకష్టపడి ఎవరి పర్సుకొట్టేశానో నాకు అర్థమయ్యింది.. నా తమ్ముడి పర్సును నేను కాజేశాను.

అతను- ఆ డాబుగా వున్నవాడు నా తమ్ముడే ! చిన్నతనంలో ఎప్పుడో విడిపోవటంవల్ల దాదాపుగా ఇరవై యేళ్ళ తర్వాత వాడిని గుర్తించలేక పోయాను. అందువల్లనే ఇలా జరిగింది....

ఒక్క నిముషం కూడా ఆలస్యం చెయ్యలేదు.

బిల్లు చెల్లించి రివ్వున బయటకు వచ్చి ఆసెంటర్లో ఖాళీగావున్న ఆటోరిక్షా ఎక్క బస్టాండుకు వెళ్ళాను. ఆ బస్టాపులో బస్సు లేదు. జనం కూడా ఎక్కువగా లేరు.

కొంచెంసేపు అక్కడే వుండి వెనక్కు తిరిగాను.

ఇరవై యేళ్ళ తర్వాత నా తమ్ముడు నా ఎదురుగానే కనపడినా గుర్తించలేక పోయాను.

నిజంగా దురదృష్టం.... ఇప్పుడైనా పర్సులో ఆ ఫోటో ఉన్నం దున తెలుసుకో గలిగాను.

మళ్ళీ నేను వాడిని కలుసుకోగలనా ?

ఇంతకీ ఆ బస్సులో వాడు ఏవూరు వెళ్ళాడు ? ఏఊళ్ళో వుంటు న్నాడు ? ఇలాంటి ప్రశ్నలెన్నో నాలో తలెత్తాయి.

ఆ డబ్బు నాతమ్ముడిదని తెలిసిన తర్వాత దాన్ని నేను అను కున్నట్టుగా ఖర్చు పెట్టలేక పోయాను.

ఆ సాయంత్రం కూడా చాలా సేపు బస్టాండులో గడిపాను. ప్రతి మనిషినీ జాగ్రత్తగా పరిశీలించాను. అతని మొహం నాకు బాగానే జ్ఞాపకం.... ఆ రూపం చెరిగిపోకుండా ప్రతి నిముషం నా మనసులో గుర్తు చేసుకుంటూనే వున్నాను.

ఊరంతా తిరిగాను. ఎక్కడా వాడు కనిపించలేదు. గొప్ప నిరుత్సాహం నన్ను ఆవరించింది. ఆ తర్వాత నాలుగు రోజులు వరుసగా నాతమ్ముడికోసం వెతుకుతూనే వున్నాను. ఐనావాడు దొరకలేదు

చివరికి నేను కూడా నా తమ్ముడు ఎక్కిన బస్సునే ఎక్కి ఆ బస్సులో చివరి స్టేజీ వరకూ వెళ్ళాను. అవూళ్ళో కూడా రెండురోజులు తిరిగాను. ఐనా ప్రయోజనం లేదు.

వాడా మధ్యలో ఏదైనా వూళ్ళో దిగాడేమో! ఎలా తెలుస్తుంది? ఎక్కడని వెదకటం ??

తిరిగి వచ్చాను.

రోజూ చాలా సేపు వాడికోసం చూస్తూనే వున్నాను.

నాకు బాగానే గుర్తు. విడిపోయే ముందు ఆ ఫోటో వాడిదగ్గరే వుంది. విడిపోయిన తర్వాత కూడా చాలా రోజులు నేను వాడికోసం ప్రయత్నం చేశాను.

ఎక్కడా దొరకలేదు.

మా అమ్మకూడా చనిపోయిన తర్వాత రోడ్డునపడి ఊరువదిలిన మేము ఎక్కడో ఒక వూళ్ళో జరుగుతున్న సంబరంలో– జన ప్రవాహంలో విడిపోయాము. అంతే మళ్ళీ కలుసుకోలేదు.

నాకు చిన్నతనం రోజులు ఒకటొకటిగా గుర్తుకొచ్చాయి. నా పట్ల తమ్ముడి ప్రేమ గుర్తుకు రాగానే కన్నీళ్ళు వచ్చాయి. అలాంటి తమ్ముడి పర్సునే కొట్టేశాను చివరికి.

ఆఖరికి నావృత్తే నా తమ్ముడిని నాకు తెలియజేసింది. నేను మరో వృత్తిలో వున్నట్టయితే నా తమ్ముడిని ఈ జన్మకు చూసే అవకాశం వుండేది కాదేమో !–

నెల రోజులు గడిచాయి.

ఆరోజు కూడా ఉదయం పదిగంటలు అవుతున్నప్పుడు బస్టాండుకు వచ్చాను.

దూరంనించే నాకు అతను- అవును- వాడే- నా తమ్ముడు దాబుగా కనిపించాడు.

రివ్వున పరిగెత్తాలనిపించింది. నడక వేగం పెంచాను. మరో రకం దుస్తులు వేసుకున్నాడు ! ఐనా గుర్తించగలిగాను.

కళ్ళకు అవే నల్లని అద్దాలు, విలాసంగా సిగరెట్టు కాలుస్తున్నాడు. ఐతే అక్కడ జనం రద్దీలేదు. ఒక్కడే నిలబడి వున్నాడు.

'తమ్ముడూ' అనికేక వెయ్యాలని పించింది. కానీ వాడు గుర్తిస్తాడో లేదో తెలుసుకోవాలి....నేనెవరో, వాడెవరో తెలియ జెప్పాలి ముందు అనుకున్నాను.

దగ్గరగా వెళ్ళాను నవ్వు మొహంతో-

వెళ్ళి జేబులోనించి పర్సు బయటకు తీసి "ఈ పర్సు మీదేనా?" అనడిగాను.

అతను ఆశ్చర్యంగా "అవును. ఇది మీదగ్గరకు ఎలావచ్చింది!" అన్నాడు చేయి ముందుకు పెట్టి-

అందులోనించి ఫోటో బయటకు తీస్తూ"చెప్పుకోవాలంటే సిగ్గుగా వుంది. ఐనా ఫర్వాలేదు. దీన్ని నేను కొట్టేశాను. ఈ ఫోటోని చూడు. ఇందులో నీ ప్రక్కనే వున్న ఈ మనిషి ఎవరనుకున్నావ్ ? నేనే నీ అన్నయ్యను....నువ్వు నా తమ్ముడివి" అన్నాను సంతోషంతో కూడిన తడబాటులో-

ఫోటో నా చేతిలోనే వుంది.

అతను పర్సును అందుకుని డబ్బు చూసుకుని దాన్ని జేబులో పెట్టుకుంటూ ఇలా అన్నాడు.

"సారీ- ఈ పర్సును ఎప్పుడు ఎవరిదగ్గర కొట్టేశానో గుర్తు రావటం లేదు."

నేనొక గొప్ప అగాధంలోకి జారిపోతున్నట్లనిపించింది.

*

(1986 జనవరి 'జ్యోతి' మాసపత్రికలో ప్రచురితం)